క్లుప్తంగా

టీబీ వ్యాధిగ్రస్తులకు సరుకులు అందజేత



రాజోళి: మండల కేంద్రంలో టీబీ వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకులను తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ అందచేశారు. గురువారం బియ్యం, కందిపప్పు, మంచినూనె, చింతపండు, కూరగాయలు, సబ్బులు, చక్కెర, కారంపొడి తదితర సరుకులను పంపిణీ చేశారు. క్షయ వ్యాధిగ్రస్తులకోసం సరుకులు అందజేసేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు నిషాక్, చేనేత శ్రామిక సేవా సమితి సభ్యుడు వీరేష్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం



రాజోళి: ఉపాధి హామీ పథకంపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రేపల్లె దేవదాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఉపాధి హామీ కూలీలతో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలపై ఒత్తిడి తెస్తుందన్నారు. కొత్త నిబంధనలతో కూలీలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. నిధులను తగ్గిస్తూ పథకాన్ని నీరుగార్చేందుకు కుట్ర చేస్తుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఈదన్న, కేవీపీఎస్ నాయకులు విజయ్, విజయలక్ష్మి, సాయి కుమార్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యూట్రీ గార్డెన్ ఏర్పాటు చేయండి



అయిజ: అంగన్‌వాడీ కేంద్రాల్లో న్యూట్రీ గార్డెన్‌లు ఏర్పాటు చేయాలని సీడీపీఓ కమలాదేవి అన్నారు. గురువారం మండలంలోని ఉప్పల క్యాంపులో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల ఎత్తు, బరువులను పరిశీలించారు. ఫుడ్ స్టాక్ రిజిస్టర్‌లు, రికార్డును పరిశీలించారు. పిల్లలు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, మెనూ ప్రకారం ఆహారం అందించాలని, టైం టేబుల్ పాటించాలని అంగన్‌వాడీ టీచర్‌ను ఆదేశించారు. ఎండాకాలంలో పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, ఓఆర్ఎస్ పాకెట్లు అంగన్‌వాడీ కేంద్రంలో అందుబాటులో ఉంచాలని కోరారు.

తిరుమలకు భజన మండలి సభ్యులు

అయిజ: తిరుమలలో అఖండ హరినామ సంకీర్తనలో పాల్గొనేందుకు గురువారం మండలంలోని సంకాపురం నుంచి విజయరాయ భజన మండలి సభ్యులు తిరుమలకు బయలుదేరారు. కార్యక్రమంలో తిమ్మప్ప, వెంకటేష్, నరసింహాచారి, ఉరుకుందు, రామలింగం, నరసింహులు, శీను, కృష్ణ, ఈశ్వరన్న, నరసింహారెడ్డి, బజారి, రాముడు, నరసింహులు ఉన్నారు.

27న తైబజార్, గొర్రెల సంత వేలం

శాంతినగర్: ఈనెల 27న శాంతినగర్ తైబజార్, గొర్రెల సంత వేలం నిర్వహించనున్నట్లు వడ్డేపల్లి పురపాలక సంఘం ఇన్‌చార్జ్ కమిషనర్ నిత్యానందం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-2024 ఏడాదికి (01-05-2023 నుంచి 31-03-2024) వరకు తైబజార్, గొర్రెల సంత బహిరంగ వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఔత్సాహికులు ఈనెల 26 ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల లోపు వేలం నిబంధనల ప్రకారం డీడీల ద్వారా డిపాజిట్లు దరఖాస్తుతోపాటు సమర్పించాలన్నారు. తైబజారు వేలం పాటలో పాల్గొనే వారు రూ.8.50 లక్షలకు సాల్వెన్సీ సర్టిఫికెట్, రూ.3 లక్షలకు డీడీ, తైబజార్‌కు రూ.2.50 లక్షలకు సాల్వెన్సీ సర్టిఫికెట్, రూ.2 లక్షలకు డీడీ, రూ.వెయ్యి చెల్లించాలని కోరారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

కేటీదొడ్డి: ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లో చేపట్టిన పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని ఏపీఓ కుమార్ సూచించారు. మండలంలోని గువ్వలదిన్నెలో చేపట్టిన ఉపాధి పనులను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కూలీలకు నీటి వసతి ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భీగు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కరువు

డ్రెయినేజీలు అస్తవ్యస్తం
రోడ్లపై పారుతున్న మురుగు



మానవపాడు ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు మధ్యలో రాళ్లు

మానవపాడు: గ్రామాల్లో మౌలిక వసతులు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. ఇళ్ల మధ్య మురుగు ప్రవహిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. కంపు వాసన భరించలేక గ్రామస్తులు రోగాలబారిన పడుతున్నారు. దోమల బెడద కూడా అధికంగా ఉండటంతో నరకయాతన అనుభవిస్తున్నారు. వ్యాధుల కారణంగా ఆస్పత్రి పాలవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. చాలా గ్రామాల్లో సీసీ రోడ్లు లేక వర్షాకాలంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలో నేటికీ అండర్ డ్రెయినేజీ వ్యవస్థ లేక దుర్వాసన వెదజల్లుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తెలిసినా పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

రోడ్లపై మురుగు

మండలంలోని 17 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతి గ్రామ పంచాయతీ పరిధి లో గ్రామాల్లో రోడ్లపై మురుగు పారుతోంది. డ్రెయినేజీ వ్యవస్థ, సీసీ రోడ్లు నిర్మాణాలు నిర్మించలేదు. సీసీ రోడ్లు నిర్మించిన గ్రామాల్లో మిషన్ భగీరథ కోసం తీసిన గుంతలు పూడ్చకపోవడంతో ప్రయాణించేందుకు కూడా వీలు లేకుండా పోయిందని పలు గ్రామాల ప్రజలు వాపోయారు. మురుగు రోడ్లపైనే ప్రవహించడంతో దోమలు, ఈగలు ఆవాసాలు ఏర్పర్చుకున్నాయి. మండలంలోని చెన్నిపాడు, మానవపాడు, కొర్విపాడు, పల్లెపాడు, బోరవెల్లి, జల్లాపురం, నారాయణపురం తదితర గ్రామాలలో సమస్య అధికంగా ఉంది. ఇప్పటికైనా ఆయా గ్రామాల అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

దుర్వాసన భరించలేకపోతున్నాం



మండలంలోని రోడ్లకు చుట్టు పక్కల డ్రెయినేజీలు సరిగ్గా లేవు. కంపువాసన భరించలేకపోతున్నాం. కొన్నిచోట్ల మురుగు రోడ్లపైనే పారుతోంది. విద్యార్థులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

-యుగంధర్, చెన్నిపాడు

సమస్యను పరిష్కరిస్తాం

మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తాం. డ్రెయినేజీ నిర్మాణాలకు చర్యలు తీసుకుంటాం. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీల్లో రోడ్డు మధ్యలో ఉన్న గుంతలను పూడ్చివేస్తాం. ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తాం. నిధులు మంజూరు అయిన వెంటనే గ్రామాలలో పనులు ప్రారంభిస్తాం.

– రమణరావు, ఎంపీడీఓ, మానవపాడు

అంబేడ్కర్ అందరివాడు



అంబేడ్కర్ విగ్రహాన్ని శుభ్రం చేస్తున్న యువకులు



ప్రియదర్శిని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో ..

గద్వాల అర్బన్: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ అందరివాడని ప్రిన్సిపాల్ సంపత్ కుమార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో ముందస్తుగా అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగం ఎంతో గొప్పదని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు ఉన్నారు.

అయిజ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించేందుకు బీజేపీ యువమోర్చా నాయకులు ఏర్పాట్లలో నిమగ్నం అయ్యారు. ఇందులో భాగంగా గురువారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహాన్ని నీటితో శుభ్రం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మేడికొండ భీమ్‌సేన్‌రావు, నాగరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శులు ప్రదీప్‌కుమార్, భగత్‌రెడ్డి, పట్టణ వాణిజ్య సెల్ కన్వీనర్ అంతంపల్లి కృష్ణ, యువ మోర్చా అధ్యక్షుడు అంజి, ఉపాధ్యక్షుడు శివ, శేఖర్, పరశురాము, బూత్ స్థాయి అధ్యక్షుడు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



కంటి వెలుగును ప్రారంభిస్తున్న ఎంపీడీఓ

మల్దకల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కృష్ణయ్య కోరారు. గురువారం మండలంలోని మద్దెలబండ పెద్దతండాలో కంటి వెలుగు కేంద్రాన్ని సర్పంచ్ తాన్యానాయక్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటి పరీక్షలు ఉచితంగా చేస్తారని అవసరమైన వారికి అద్దాలు, ఆపరేషన్‌లు చేస్తారని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్లు నవీన్‌కుమార్, స్వరూపరాణి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గట్టు: మండలంలోని ఆరగిద్ద, ఇందువాసి గ్రామాల్లో కంటి వెలుగు వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాల్లోని ప్రజలకు వైద్యులు కంటి పరీక్షలను నిర్వహిస్తున్నారు. రెండు గ్రామాల్లో మొత్తం 305 మందికి కంటి పరీక్షలు, 17 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. 22 మందికి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపించినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు తిమ్మప్ప, నర్సింహులు, సీహెచ్ఓ ఊసేని, హెల్త్ సూపర్ వైజర్లు మక్బూద్, స్వర్ణలత, ఏఎన్ఎంలు ఈశ్వరమ్మ, తాహేరా, విఘ్నేశ్వరి, జయమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం



క్రీడాకారులతో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యే అబ్రహం

అయిజ: క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా గురువారం పట్టణంలో యోబు యువసేన ఆధ్వర్యంలో 'మహిళా ఇన్విటేషన్ కబడ్డీ టోర్నమెంట్' నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వారు హాజరై క్రీడలను ప్రారంభించారు. క్రీడా స్ఫూర్తితో ఆడాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

అలంపూర్: క్రీడలతో స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అన్నారు. పట్టణంలోని చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతిని పురస్కరించుకొని ఓపెన్ వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులకు బంగారు భవిష్యత్ ఉంటుందని తెలిపారు. మొదటి విజేతకు డాక్టర్ రాజన్న రూ. 50 వేలు, రెండో విజేతకు మహబూబ్‌నగర్ వాలీబాల్ అసోసియేషన్ రూ. 30 వేలు, మూడో విజేతకు రాజగోపాల్ రూ. 20వేలు అందజేస్తారని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి, నాయకులు డాక్టర్ రాజన్న, సుదర్శన్ గౌడ్, నారాయణ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వెంకట్రామయ్య శెట్టి, జితేందర్ గౌడ్, జయరాములు తదితరులు ఉన్నారు.

గట్టు: క్రీడాకారులకు బంగారు భవిష్యత్ ఉంటుందని జెడ్పీటీసీ బాసు శ్యామల, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు బల్గెర హనుమంతులు అన్నారు. గురువారం మండలంలోని బల్గెరలో దిగంబరస్వామి జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలను వారు ప్రారంభించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రూపవతి, కిష్టప్ప, బజారి, బాసునాయుడు, రామకృష్ణ, బాసు గోపాల్, డీఆర్ నాయుడు, ఈరన్న, రాముడు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల సౌకర్యార్థం బస్సు సర్వీసులు



గద్వాల క్రైం: ప్రయాణికుల సౌకర్యార్థం బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం బస్టాండ్ ఆవరణంలో నూతన బస్సుకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బస్సు సర్వీసులు కొరత లేకుండా దూరదృష్టితో ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. భవిష్యత్తులో అదనపు బస్సులను డిపోకు కేటాయించేల చర్యలు తసుకుంటామన్నారు. బస్టాండ్ నిర్మాణ పనులపై అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ కేశవ్ తదితరులు ఉన్నారు.

మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి



మద్దెలబండలో నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

మల్దకల్: హరితహారంలో భాగంగా నర్సరీలలో పెంచుతున్న మొక్కలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎంపీడీఓ కృష్ణయ్య, ఎంపీఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మద్దెలబండ, మద్దెలబండ పెద్దతండా గ్రామాల్లోని నర్సరీలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీ నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి నర్సరీలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలను పెంచి హరితహారం నాటికి సిద్ధం చేయాలన్నారు. ఎండిన మొక్కల స్థానంలో కొత్త విత్తనాలు విత్తాలన్నారు. మొక్కలు ఎండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ప్రతి గ్రామంలో వందమంది కూలీలకు తగ్గకుండా పనులకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచు తాన్యానాయక్, నర్సరీ నిర్వాహకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సందెరాళ్ల పోటీలు



బహుమతులను అందజేస్తున్న జెడ్పీటీసీ

గట్టు: మండలంలోని బల్గెరలో దిగంబరస్వామి జాతర సందర్భంగా గురువారం సందెరాళ్ల పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాలకు చెందిన ఔత్సాహికులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పోటీలను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల వారు తరలి వచ్చారు. సందెరాళ్ల పోటీల్లో మొదటి బహుమతి నాగర్‌దొడ్డి ప్రతాప్ రూ.10,016 దక్కించుకున్నారు. ద్వితీయ బహుమతి ఇబ్రహీందొడ్డి వెంకటేష్ రూ.5,016లు, తృతీయ బహుమతి గుడేబల్లూరు సూరి రూ.3,016లు, నాల్గో బహుమతి గుంజపల్లె ఆంజనేయులు రూ.2016లు దక్కించుకున్నారు. విజేతలకు జెడ్పీటీసీ బాసు శ్యామల, సర్పంచుల సంఘం అధ్యక్షుడు బల్గెర హనుమంతునాయుడులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బసప్ప, గిరప్ప, బాసు గోపాల్, నర్సప్ప, హనుమంతు, డీఆర్ నాయుడు, బుగ్గల్, రాముడు, పాల్గొన్నారు.

టీసేవ్ ఫోరం లోగో ఆవిష్కరణ



గద్వాల అర్బన్: ఉద్యోగ నియామకాలు చేపట్టలేక నిరుద్యోగుల జీవితాలతో బీఆర్ఎస్ ప్రభుత్వం చెలగాటమాడుతోందని వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ అతికూర్ రహ్మాన్ అన్నారు. పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఏర్పాటు చేసిన టీ సేవ్ ఫోరానికి సంబంధించిన లోగోను గురువారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఆవిష్కరించి మాట్లాడారు. నిరుద్యోగ సమస్యలపై పార్టీ నిరంతరం పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్



మానవపాడులో ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లింలు

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపలిటీ పరిధిలోని శాంతినగర్‌లో రంజాన్ ఉపవాస దీక్షలు చేపడుతున్న ముస్లింలకు పట్టణానికి చెందిన ఫక్రుద్దీన్ గురువారం ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఇందిరానగర్‌లోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విందుకు రజాక్ మౌలానా, కలీముల్లా మౌలానాలు హాజరై సర్వమానవాళి శ్రేయస్సు కోసం దువా చేశారు. కార్యక్రమంలో అల్ మదీన యూత్ సభ్యులు, పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని జామీయా మసీద్‌లో గురువారం ముతవల్లి మహ్మద్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో షాకిర్, మంజూరు, రఫీ, ఆషద్, అన్వర్, రహిమాన్, ఇబ్రహీం, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

'ఆత్మీయ సమ్మేళనాలతో ఒరిగేదేమీలేదు'

ఎర్రవల్లిచౌరస్తా: బీఆర్ఎస్ నాయకులు నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనాలతో ఒరిగేదేమీలేదని యువజన కాంగ్రెస్ నియోజక వర్గ అధ్యక్షుడు జోగుల రవి అన్నారు. గురువారం ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తా ఆ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు కేవలం పదవుల కోసం రాజకీయం చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ దళితులకు చేసిందేమీ లేదని విమర్శించారు. ముఖ్యమంత్రిని దళితుడిని చేస్తానని చెప్పి మాటతప్పారన్నారు. బీఆర్ఎస్ నాయకులు అభివృద్ధిని మరిచి పదవుల కోసం, కమీషన్ల కోసం కొట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

16న గురుకుల ప్రవేశ పరీక్ష

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈ నెల 16వ తేదీన గురుకులాల్లో మిగిలిన సీట్లను భర్తీ చేయడం కోసం ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తిరుపతయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు మొత్తం 626 మంది విద్యార్థులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఉదయం గం. 11-00 నుంచి మధ్యాహ్నం 01-00 తరకు పరీక్ష నిర్వహిస్తునట్లు వివరించారు. హాల్ టికెట్, వాటర్ బాటిల్, పెన్ను, మాస్కు తీసుకురావాలని కోరారు.

బీజేపీ బలోపేతమే లక్ష్యం

అయిజ: బీజేపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని ఆ పార్టీ నాగర్‌కర్నూల్ పార్లమెంటరీ ఫుల్ టైమర్ కేతూరి బుడ్డన్న అన్నారు. గురువారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు శేఖర్ ఆధ్వర్యంలో బీజేపీ శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌ల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. బూత్ స్థాయి కమిటీలు 31 సభ్యులతో సంపూర్ణంగా వేయాలన్నారు. మండల ప్రధాన కార్యదర్శి గోపాల కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, భీమ్‌రెడ్డి, నర్సన్‌గౌడ్, అంతంపల్లి కృష్ణ, మండల కార్యవర్గ సభ్యులు పరుషరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని వల్లూరులో వేణుగోపాలస్వామి రథోత్సవాన్ని పురస్కరించుకొని న్యూ కేటగిరి బండలాగుడు పోటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గురువారం అలంపూర్ ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం హాజరై బండలాగుడు పోటీలను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ఇలాంటి పోటీలతో ఆహ్లాద కర వాతావరణం ఏర్పడుతోందని పేర్కొన్నారు. అనంతరం గ్రామ రైతులు, నాయకులు ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, రైతు సంఘం నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు వినతి



ఉండవెల్లి: మండలంలోని తక్కశిలలో ఉమారామలింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో గ్రామానికి చెందిన వ్యక్తి అక్రమంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నారని వెంటనే పనులను నిలిపివేయాలని ఉపసర్పంచ్ ఆనంద్ గౌడ్, గ్రామస్తులు ఎంపీడీఓకు గురువారం వినతి పత్రం అందజేశారు. గత నెల 27న ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో రవి, శంకర్ గౌడ్, కృష్ణయ్య, గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మాంటిస్సోరిలో లారెన్స్ డే వేడుకలు



బహుమతి చూపిస్తున్న విద్యార్థులు

అలంపూర్: పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించిన లారెన్స్ డే వేడుకలు బుధవారం రాత్రి నిర్వహించారు. క్రీడల్లో నైపుణ్యం ఉన్న విద్యార్థులకు నాలుగు హౌజ్‌లుగా విభజించి ఆట పోటీలు ఏర్పాటుచేశారు. ఆయా హౌజ్‌లలో క్రికెట్, వాలీబాల్, కోకో, టెన్నికాయిట్, కబడ్డీ, త్రోబాల్ అథ్లెటిక్స్ 100, 400 మీటర్ల పరుగు పందెం, బెస్ట్ ప్రిఫెక్ట్, బెస్ట్ ప్లేయర్ ఆఫ్‌ది హౌజ్ ఇయర్ ఎంపిక చేసి సీనియర్ ఉపాధ్యాయులకు బహుమతులను అందజేశారు. ఈ వేడుకల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు బహుమతులను ప్రదానం చేశారు. వివిధ విభాగాలలో రాణించిన వారికి కరస్పాండెంట్ కేఎస్‌వీ రవిప్రకాష్, ప్రిన్సిపాల్ నాగలక్ష్మిలు సర్టిఫికెట్, పుస్తకాలను, మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం



హాజరైన నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు

శాంతినగర్: ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డా.వెంకటేశ్వర్లు అన్నారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్ ఈశ్వరాంబ ఆలయ ప్రాంగణంలో నాయీ బ్రాహ్మణుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు మండల సంఘాలు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో బ్యాండ్ ఆంజనేయులు, మురళి, రాజు, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ అమలు చేయాలి

గద్వాల: పాత పెన్షన్‌ను అమలు చేయాలని సీపీఎస్ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. పాత పెన్షన్ అమలు కోరుతూ ఈ నెల 16న ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలో పెన్షన్ కాన్స్టిట్యూషనల్ ర్యాలీ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా గురువారం వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలలో ర్యాలీకి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

అర్హులకు పట్టాలు ఇచ్చే వరకు పోరాడుతాం

రాజోళి: అర్హులకు పట్టాలు ఇచ్చే వరకు పోరాడుతామని వ్యవసాయ శాఖ సంఘం జిల్లా కార్యదర్శి దేవదాసు అన్నారు. గురువారం మండల కేంద్రంలో వరద బాధితులకు కేటాయించిన స్థలంలో గతంలో ప్రభుత్వం పట్టాలు అందించిన వారికే కేటాయించాలని సీపీఎం నాయకులు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. తుమ్మలపల్లెకు చెందిన రమాదేవికి, మాణిక్య రెడ్డిలకు పట్టాలు ఇచ్చారని వరద బాధితుల స్థలంలోనే వారికి స్థలం ఇవ్వాలని అధికారి జోషి శ్రీనివాస్ శర్మకు వినతి పత్రం అందచేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఈదన్న, సీపీఎం మండల కార్యదర్శి విజయ్‌కుమార్, దండోరా నాయకులు భాస్కర్ పాల్గొన్నారు.

చీటింగ్ కేసు నమోదు

గద్వాల క్రైం: ఇనాం భూముల ఓఆర్‌సీ, భూ బదలాయింపు, కొనుగోలు చేసిన నిందితులపై పట్టణ పోలీసు స్టేషన్‌లో గురువారం చీటింగ్ కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ అబ్దుల్‌షుకుర్ తెలిపారు. గద్వాల పట్టణ శివారులోని సర్వే నంబర్ 730, 733లో 18 ఎకరాల ఇనాం భూములను కై రాత్ ఇనాం భూములుగా గద్వాలకు చెందిన రాములమ్మ, పద్మావతమ్మ, వెంకట నరసయ్య, శేషాద్రి తప్పుడు డాక్యుమెంట్లు, ఫోర్జరీ సంతకాలతో ఓఆర్‌సీ చేసుకున్నారు. అప్పటి రెవెన్యూ అధికారులు, శివకుమార్ (ఆర్ఐ), కర్ణకుమార్ (డీటీ), ఈదన్న (వీఆర్ఓ), హజీజ్ (ఏఓ), వెంకటేశ్వర్లు, (సెక్షన్ ఆఫీసర్) బిక్ష(ఆర్డీఓ)లు ఓఆర్‌సీ ఇచ్చారు. ఖాజీ గౌస్ ఫిర్యాదుదారుడు ఇనాం భూములు అక్రమంగా ఓఆర్‌సీ చేయించినట్లు కోర్టులో ఫిర్యాదు చేయగా రెవెన్యూ అధికారులు, ఓఆర్‌సీ ఒకే రోజు చేయించుకునట్లు గుర్తించి బాధితులు కోర్టులో ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులపై, ఓఆర్‌సీ చేయించుకున్న వారిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.